అద్భుత శక్తి

ప్రతాప రవిశంకర్

"పునర్జన్మలున్నాయా?" అడిగాడు జమదగ్ని.

ఆయన నవ్వాడు. తలవూపి "వున్నాయి" అన్నాడు.

చాలామంది సాధువులను ఎన్నోసార్లు ఆ ప్రశ్నను అడిగాడు అతను. అతను అడిగిన వాళ్ళంతా పునర్జన్మలు వున్నాయనే చెప్పారు. ఒక్క మనిషికూడా లేవని చెప్పలేదు. ఐనా తను కలుసుకున్న ప్రతి సాధువునీ పునర్జన్మల గురించి అతను అడుగుతూనే వున్నాడు.

జమదగ్ని రైల్వే స్టేషన్లో సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు. అతడికి కొంచెం దూరంలో చివరగా సాధువు కూర్చున్నాడు.

ఇద్దరికీ మధ్యలో జోలెలాంటిది వుంది. దానిపక్కనే లావుపాటి కర్రకూడా వుంది. ఆ రెండూ సాధువువే.

రాత్రి ఎనిమిది గంటలు దాటింది.

ఆ స్టేషన్లోకి రాత్రి పదిగంటలు కానిదే అప్పట్లో రైలు రాదు. ఏడూ ఇరవైకి వచ్చిన పాసింజరు రైలు

అరగంట క్రితమే వెళ్ళిపోయింది.

రైలు వెళ్ళిపోయిన తర్వాత పార్కు నించి ఇంటికి వెళ్ళిపోదామనుకున్నాడు అతను. కాని ఎవరైనా సాధువులు వెళ్ళిపోయిన రైలులో నించి దిగివుంటారనుకుని స్టేషన్ కి వచ్చాడు.

అతడి ఆలోచన నిజమే అయ్యింది.

సాధువు కనిపించాడు.

కొంచెం దూరంనించి ఎత్తుగా స్తంభానికి వేలుగుతున్న లైటు కాంతి వాళ్ళిద్దరిమీదకూ అస్పష్టంగా పడుతోంది.

గడ్డాన్ని చేత్తో దువ్వుకున్నాడు సాధువు.

ఒక్క నిమిషం ఆయన్ని మసక చీకట్లో అదోలా చూసి "పునర్జన్మలు గుర్తుండే అవకాశం రెండో జన్మ ఎత్తిన మనుషులకు వుంటుందంటారా?" అనడిగాడు.

ఆయన విసుక్కోలేదు. ఎందుకు నీకీ ప్రశ్నలు? అని అడగలేదు.

జమదగ్నివైపు చూస్తూ "అందరికీ వుంటుందని చెప్పలేను. కొంతమందికి వుంటుంది. అలాంటి సంఘటనలు చాలా జరిగాయి. నువ్వు పేపర్లలో ఎప్పుడైనా చదివే వుంటావు. అందులో నిజం వుంది" అన్నాడు.

ఆయన వయసు అరవై ఏళ్ళవరకూ వుండే అవకాశం వుంది. పొడుగాటి నెరిసిన గడ్డం వుంది ఆయనకి. జుట్టు ఎత్తుగా పైకి లేచి వుంది పాము చుట్టలుగా. నోరు కనపడ్డంలేదు. మాట్లాడేటప్పుడు మాత్రం గుహలాగా తెరుచుకుంటున్నది.

"చదివాను. కాని ఆ వార్తల్లో ఎంతటి నిజం వుందో అంచనా వేసుకోలేకపోయాను. నాకూ పునర్జన్మలు,

అతీంద్రియ అద్భుతశక్తులు వున్నాయనే నమ్మకం వుంది. వాటిని సాధించాలనే కోరిక వుంది. అందుకే ఇవన్నీ అడుగుతున్నాను. మీరు విసుక్కోవటం లేదుకదా" అని అడిగాడు.

"కాలక్షేపానికి కొంతమంది మాలాంటి మనుషులతో సంభాషణ జరుపుతారు. ఈ విషయాల్లో నమ్మకం లేని మనుషులు వాదనలోకి దించి మమ్మల్ని హేళన చెయ్యటానికి ప్రయత్నం చేస్తారు. కాని—నువ్వు ఈ విషయాల గురించి నిజంగా ఆసక్తి వుండే అడిగావని నాకు తెలుసు."

"థాంక్స్" అన్నాడు జమదగ్ని వెంటనే.

ఆయన నవ్వాడు. కాని ఈసారి ఆ మీసాల మధ్య నించి ఆ నవ్వు బయటకు రాలేదు.

"అతీంద్రియ శక్తుల గురించి మీ ఉద్దేశం ఏమిటి?" మళ్ళీ అడిగాడు జమదగ్ని.

ఆయనలా మాట్లాడటంతో అతనికి హుషారు కలిగింది.

"అతీంద్రియ శక్తులు వున్నాయి. వాటిని పొందటం అందరికీ సాధ్యంకాదు. కొంతమంది మనుషులకే అది సాధ్యం...."

"మీరు అలాంటి శక్తులను ఏటికైనా సాధించారా?" వెంటనే అడిగాడు.

తలను అడ్డంగా వూపాడాయన.

"సహజంగానే మనుషుల్లో కొన్ని శక్తులు వుంటాయి. అటువంటి శక్తి యేదైనా నాలో వుంటే వుండొచ్చు. దాన్ని నేనో గొప్పశక్తిగా అనుకోవటంలేదు. ప్రత్యేకించి నేను యెటువంటి అతీంద్రియ శక్తులను సాధించలేదు."

కొంత నిరుత్సాహం కలిగింది జమదగ్నికి.

ఆ రైల్వేస్టేషన్ ఆవరణలోనే—ఆ సిమెంట్ బెంచీ మీదనే యెంతోమంది సాధువులను కలుసుకున్నాడు అతను. ఇటువంటి విషయాల గురించే సంభాషణలు జరిపాడు. కాని వాళ్ళంతా తమకేమీ అతీంద్రియ శక్తులు లేవనే చెప్పారు. వున్నాయని ఒక్కరూ చెప్పలేదు.

ఈ సాధువుకూడా అలాగే చెబుతున్నాడు.

వీళ్ళంతా చెప్పేది నిజమేనా?

సాధువులయివుండీ ఒక్క శక్తినీ సాధించలేక పోయారా?

"నమ్మలేకుండా వున్నాను. అన్ని సుఖాలనీ, కోరికలనీ త్యజించి ఎన్నో ప్రదేశాలూ తిరుగుతూ—ఎంతోమంది మహనీయులను కలుసుకునే మీకు అతీంద్రియ శక్తులు లేవంటే ఆశ్చర్యంగా వున్నది" అన్నాడు జమదగ్ని.

ఈసారి ఆయన తెలిసేట్టుగానే నవ్వాడు.

"అన్ని కోరికలనీ—సుఖాలనీ త్యజించిన మాలాంటి మనుషులకు అతీంద్రియ శక్తులతో పనేమిటి?" అన్నాడు.

నిజమే అనుకున్నాడు జమదగ్ని. కాని అతడికి ఏదో అసంతృప్తిగా వుంది. ఆ శక్తుల గురించి తెలుసుకోవాలని ఆ శక్తుల ప్రభావం ఎలా వుంటుందో చూడాలని కోరికగా వున్నది. కాని అతడి కోరిక తీరటంలేదు.

ఉన్నట్టుండి అడిగాడు జమదగ్ని—

"మీకు బంగారు తయారుచెయ్యటం వచ్చునా?"

మామూలుగానే చూశాడాయన.

"రాదు. తెలుసుకోవాలనికూడా అనుకోలేదు. ఒకసారి కాశ్మీర దేశంలో ఒక బైరాగి నాకు బంగారాన్ని

తయారుచెయ్యటం గురించి చెబుతానన్నాడు. నేనే వద్దన్నాను."

"మై గాడ్! అలాంటి బంగారంలాంటి అవకాశాన్ని వదులుకున్నారా?" నమ్మలేనట్టు అడిగాడు జమదగ్ని.

"అవును. నాకిష్టంలేదు. బంగారంతో నాకేమిటి అవసరం? సమస్యను కొని తెచ్చుకోవటమే అవుతుంది."

"నిజంగా మీరు గొప్పవాళ్ళు" అన్నాడతను.

ఆ పొగడ్త ఆయన పొంగిపోలేదు.

స్టేషన్‌లో గంటలు కొట్టేవాడు దూరంగా చెట్టు కింద వెల్లకింతలా పడుకుని యేదో సినిమాలో పాట పాడుతున్నాడు.

స్టేషన్‌లో జనం లేరు.

జమదగ్ని చేతికి వాచీ వుంది—ఐనా అతను టైము ఎంతయ్యిందోనని చూసుకోవాలని అనుకోలేదు టైము తెలీకుండానే అతను సాధువులతో కబుర్లు చెబుతూ వుంటాడు.

చిన్నతనం నించీ యెందుకనో అతడికి బైరాగులు, సాధువులు అంటే ఇష్టంగా వుండేది. వాళ్ళంటే అతనికి గౌరవం. అన్నింటిని వదులుకుని వాళ్ళు దేశాటన చేస్తూ వుంటారని — ఎక్కువ ప్రదేశాలు తిరిగి ఎక్కువ లోక జ్ఞానాన్ని సంపాదించిన మేధావులనీ అతని నమ్మకం.

ఆ రైల్వేస్టేషన్‌లో అప్పుడప్పుడు వచ్చేపోయే రైలు బండ్లలో సాధువులు - బైరాగులు దిగుతూ వుంటారు. అందుకే జమదగ్ని యేమీ తోచనప్పుడు స్టేషన్‌కి వస్తూ వుంటాడు.

ఆ సాధువుల దగ్గర వుంటే యేదైనా శక్తుల్లో ఒక్క శక్తినైనా తను పొందాలని అతడి కోరిక.

8

"నా మనసులో ఒక కోరిక వుంది ఎన్నాళ్ళుగానో.. కాని తీరటంలేదు" అన్నాడు జమదగ్ని ఆయన్ని చూస్తూ.

"ఏమిటి? యేదైనా అద్భుత శక్తిని సాధించాలనా?" అడిగాడాయన.

"అవును....మీ కెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు జమదగ్ని.

"నీ మాటలతో అర్థం చేసుకున్నాను."

"ఇప్పుడు చెప్పండి. యేదైనాసరే. ఒక అద్భుత శక్తిని సాధించగలిగే మార్గం యేమిటి?"

ఒక్క నిమిషం తర్వాత ఆయన ఇలా అన్నాడు:

"ఏ మార్గాన్ని నేను చెప్పవలసిన అవసరంలేదు. ఆ మార్గమే నిన్ను వెతుక్కుంటూ వస్తుంది. దగ్గర్లోనే నీ జీవితంలో ఒక గొప్ప సంఘటన జరగబోతోంది. ఆ సంఘటన నీ జీవితాన్నే మార్చెయ్యగలదు."

"నిజమా! ఏమిటా సంఘటన? ఎప్పుడు జరగబోతోంది? చెప్పండి" అడిగాడు జమదగ్ని కుతూహలంగా.

చెప్పటం ఇష్టంలేనట్టు చటుక్కున బెంచిమీదనించి లేచి వెళ్ళిపోయాడు సాధువు.

2

"ఇంకా యేమిటి ఆలస్యం" అన్నాడు రామానుజ రావు గదిలోకి వచ్చి....

కుర్చీలో వెనక్కివాలి కూర్చున్నాడు జమదగ్ని.

"నా ఆలస్యం లేదు. అమ్మ మేకప్ పూర్తి కాలేదను కుంటాను" అన్నాడు.

నవ్వుకుని వెళ్ళిపోయాడు ఆయన.

ఆ రోజు జమదగ్ని పెళ్ళి చూపులకు వెళుతున్నారు

వాళ్ళంతా. ఊళ్ళోనే యేదో కమర్షియల్ బ్యాంకులో ఉద్యోగంచేసి రిటైరు అయిన గురుపాదం కూతుర్ని ఆ రోజు వాళ్ళు చూడబోతున్నారు,

నిజానికి ఉద్యోగం రాకముందు పెళ్ళి చేసుకోవటం జమదగ్నికి ఇష్టంలేదు, కాని ఉద్యోగం గురించి ఆలోచించవలసిన అవసరంలేదని గురుపాదం గట్టిగా చెప్పాడు. తను ఉద్యోగంచేసి రిటైరు అయిన బ్యాంకులో తనకు బాగా పలుకుబడి వుందనీ - ఆ బ్యాంకులోనే తప్పక ఉద్యోగం ఇప్పించుకుంటాననీ రామానుజరావుతో చెప్పాడు.

అందుకే వాళ్ళు ఆ పెళ్ళి చూపులకు ఒప్పుకున్నారు.

పెళ్ళికూతురు శమంత బావుంది. బాగా అందంగా వుంది. తొలిచూపుల్లోనే జమదగ్ని హృదయాన్ని తన అందంతో కదిలించివేసింది.

ఆమె ఎర్రని పెదవులు జమదగ్నికి బాగా నచ్చాయి. శమంత అమాయకమైన లేడి కళ్ళు అతడికి మరపురానివిగా అనిపించాయి. ఒక్కసారి పెదవులు విచ్చుకోకుండానే కళ్ళతో నవ్వింది శమంత. ముగ్ధుడయ్యాడు జమదగ్ని.

అక్కడే తనకు ఆమె నచ్చిందని ప్రకటించాడు. అలా ప్రకటించినందుకు తల్లిదండ్రులు ఆశ్చర్యపడలేదు. కాబోయే కోడలి అందం అపురూపమైనది అని వాళ్ళు కూడా అంగీకరించారు.

ఆ రోజు సాయంత్రమే ముహూర్తాలుకూడా పెట్టుకున్నారు. సరిగ్గా ఆ రోజుకు నెలా పన్నెండురోజులు ఉంది పెళ్ళి. అంతమారంలో ముహూర్తాన్ని నిర్ణయించినందుకు జమదగ్నికి గొప్ప ఆశాభంగం కలిగింది.

ఎర్రటి ఆమె పెదవులు అతడిని పదేపదే కవ్వించాయి

ఆ రాత్రి. ఆమె చూపులు అతడిని కలవరపరిచాయి.

తన జీవితంలో జరగబోయే గొప్ప సంఘటన శమంతతో తన పెళ్ళనే అనుకున్నాడు. కావొచ్చు. మొదటిసారి పెళ్ళిచూపులకే ఆ అమ్మాయిని తను ఇష్టపడతాడని ఎప్పుడూ అనుకోలేదు. కాని జరిగింది.

సాధువు చెప్పిన ఆ సంఘటన ఇదే కావొచ్చు. ఐతే శమంత తన జీవితంలో ప్రవేశించటంతో తన బతుకు ఎటువంటి మలుపు తిరగబోతోంది. తనకు ఏం జరగబోతోంది? ఎటువంటి మార్పు సంభవించబోతున్నది?

జమదగ్ని ఊహకు అందలేదు.

తెల్లారి ఉదయం జమదగ్ని ఒక స్నేహితుడి ఇంటికి వెళ్ళి పన్నెండు గంటలు కావస్తున్నప్పుడు తిరిగి ఇంటికి వచ్చాడు. అప్పటికి ఒక ఉత్తరం అతనికోసం ఎదురు చూస్తోంది.

ఆ కవర్ని ఓపెన్ చేశాడు.

అందులో పెళ్ళి శుభలేఖ - దానికి జతపరచి ఓ ఉత్తరం ఉన్నాయి.

వాటిని చదివి నవ్వుకున్నాడు జమదగ్ని.

భువనేశ్వర్ లో ఉన్న అతని ఆప్తమిత్రుడు కోసలరామ్ పెళ్ళి. నాలుగు రోజులే వుంది. హఠాత్తుగా కుదిరిందనీ ఉత్తరం అందిన వెంటనే బయల్దేరి రమ్మనీ రాశాడు.

"ఎక్కడినుంచీ ఉత్తరం?" అన్నది తల్లి.

చెప్పాడు.

"తప్పకుండా వెళ్ళు .... కోసలరామ్ మంచివాడు. ఇప్పుడు నువ్వు అతని పెళ్ళికి వెళ్ళకపోతే తర్వాత అతను నీ పెళ్ళికి రాడు" అన్నదామె.

"అవును" అన్నాడు జమదగ్ని.

ఏడాది క్రితం వరకు కోసలరామ్ వాళ్ళు ఆ ఊళ్ళోనే వుండేవాళ్ళు. అప్పుడు జమదగ్ని అతడితో బాగా స్నేహంగా వుండేవాడు.

ఆ రోజు సాయంత్రం ట్రిమ్‌గా డ్రెస్ చేసుకుని జమదగ్ని శమంత ఇంటికేసి వెళ్ళాడు. అతనికి యేదో భయంగా తోచింది. ఆమె ఏమనుకుంటుంది? గర్వంగా ఫీలవుతుందా? ఏమైనా కలుసుకోక తప్పదు.

తను భువనేశ్వర్ వెళుతున్నట్టు ఆమెతో చెప్పాలి.

ఆ ఇంటికి కొంచెం దూరంగా కిళ్ళీ బంకు వుంది. అక్కడ నిల్చుంటే శమంత బయటకు వచ్చినప్పుడు తప్ప కుండా కనపడుతుంది.

నిల్చున్నాడు జమదగ్ని.

ఒక సిగరెట్టు కొని ముట్టించాడు.

రోడ్డుమీద జనం నడుస్తున్నారు.

షాపువాడు తన పనిలో వున్నాడు.

ఆ ఇంటి వైపుకే చూస్తున్నాడు జమదగ్ని.

అతనికి చాలా అసహనంగా వుంది. శమంత బయటకు వస్తుందా? రాదా? ఒకవేళ రాకపోతే తను ఏం చెయ్యాలి? ధైర్యంచేసి ఆ ఇంట్లోకి వెళ్ళాలా?

ఏమిటి చెయ్యటం?

ఇలా ఆలోచిస్తున్నప్పుడే ఆ రోడ్డుమీదకు మల్లెపూలు అమ్మేవాడు అరుచుకుంటూ వచ్చాడు. వాడు ఆ ఇంటి ముందుకు వెళ్ళిపోయాడు.

హఠాత్తుగా బయటకు వచ్చింది శమంత పూలు కొన టానికి. జమదగ్నిని చూసి ఆశ్చర్యపడింది. ఆ సమయాన్ని వృధా చెయ్యలేదు అతను. ఆమెను రమ్మని చేత్తో సైగ

చేశాడు యెవ్వరూ చూడకుండా.

పువ్వులు కొని ఆగమన్నట్టు తిరిగి సైగ చేసి వెళ్ళిపోయింది శమంత.

ఇంకో సిగరెట్టు కొని ముట్టించాడు.

దాదాపు ఇరవై నిమిషాల తర్వాత ఆ యింట్లో నించి బయటకు వచ్చి రోడ్డెక్కిందిం శమంత.

తనని దాటి కొంచెం ముందుకు వెళ్ళగానే ఆమెను అనుసరించాడు.

ఆ రోడ్డు దాటిన తర్వాత ఆమెను కలుసుకున్నాడు.

"అరగంటనించీ ఎదురు చూస్తున్నాను" అన్నాడు.

"ఇంట్లోకి రాకూడదా?" అన్నది శమంత.

"ఏమయినా అనుకోరూ?"

"ఎందుకు? మనిద్దరికీ పెళ్ళి సెటిలయ్యింది. ఇంకేమను అనుకుంటారు?" అన్నది.

"ఎక్కడికీ ప్రయాణం?" అడిగాడు జమదగ్ని.

ఆమె నవ్వింది. ఎర్రటి పెదవులు విచ్చుకున్నాయి. తర్వాత ఇలా అన్నది!

"ఈ ప్రయాణం నాది కాదు. మీరు రమ్మంటే వచ్చాను. ఈ ప్రయాణం యెక్కడికో మీరు చెప్పాలి."

"ఎందుకు వచ్చానో చెప్పటం మరచిపోయాను. నేను రేపు భువనేశ్వర్ వెళుతున్నాను" అన్నాడు.

"ఎందుకు?"

చెప్పాడు జమదగ్ని.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?"

"వారం రోజుల తర్వాత వస్తాను."

"మీకోసం ఎదురుచూస్తుంటాను" అన్నది నవ్వుతూ.

"థాంక్స్.... నాదో కోరిక,"

"అడగండి" అన్నది అతడి కళ్ళలోకి చూస్తూ—

"సినిమాకు వెళదామా?" చటుక్కున అడిగాడు.

"సినిమాకా? ఇంట్లో చెప్పలేదుకదా."

"ఎందుకు? నువ్వు నాతో వస్తున్నావు.... కావాలంటే నువ్వు నాతో సినిమాకు వచ్చినట్టు ఓ కాయితంమీద రాసి ఇస్తాను. సరేనా?" అన్నాడు.

"అవసరం లేదు. మీరు నా వెనుకే రావటం బయటకు వచ్చిన మా చెల్లెలు చూసింది. అది ఇంట్లో చెలుతుంది. కంగారుపడకులెండి" అన్నది శమంత చిరునవ్వుతో—

"తెలివైనదానివే నువ్వు" అన్నాడు జమదగ్ని.

పదినిమిషాల తర్వాత ఇద్దరూ థియేటర్లో వున్నారు. సినిమా మొదలయిన తర్వాత శమంత భుజం చుట్టూ చేతిని పోనిచ్చి చిన్నగా నొక్కుతూ "త్వరలో నా జీవితంలో గొప్ప సంఘటన జరగబోతోంది" అన్నాడు జమదగ్ని.

ఆశ్చర్యంగా అతడి కళ్ళలోకి చూసింది శమంత.

3

కోసలరామ్ సంతోషాన్ని వ్యక్తపరిచాడు - జమదగ్ని పెళ్ళికి వచ్చినందుకు....

"త్వరలో నా పెళ్ళికూడా జరగబోతున్నది" అన్నాడు జమదగ్ని....

"గుడ్ న్యూస్. ఎప్పుడు?"

చెప్పాడు అతను. శమంత అందం గురించి కూడా చెప్పాడు.

"గుడ్ సెలక్షన్" అన్నాడు కోసలరామ్.

స్నేహితుడి పెళ్ళి వైభవంగా జరిగింది.

మరు రోజునే వెళ్ళిపోతానని అన్నాడు జమదగ్ని. కాని అతను వెళ్ళనివ్వలేదు. ఇంకో రెండు రోజులు అక్కడే ఉన్నాడు.

జమదగ్నికి చాలా ఆత్రంగా వుంది. త్వరగా వెళ్ళి శమంతను కలుసుకోవాలి. ఇంకోసారి ఆమెతో సినిమాకు వెళ్ళాలి. ఎవ్వరూ చూడకుండా ఆమె ఎర్రని పెద వులపై ముద్దు పెట్టుకోవాలి.

బయలేరాడు.

స్టేషన్‌కు వచ్చి వీడ్కోలు చెప్పాడు కోసలరావు.

రైలు బయలేరింది.

కొంచెం సేపటికే చీకటిపడింది.

సూట్కేసులోనించి ఇంగ్లీషు నవల బయటకు తీశాడు జమదగ్ని. చదువుతున్నాడు.

ఉన్నట్టుండి అతని ఆలోచనలు సాధువు మీదకు మళ్ళాయి. ఇంతకీ ఆ సాధువు నిజమే చెప్పాడా?

నిజంగా తన జీవితంలో అనూహ్యమైన గొప్ప సంఘ టన జరుగుతుందా?

ఏమో!

జమదగ్నికికూడా అటువంటి సంఘటన తప్పకుండా జరుగుతుందనే నమ్మకంగా అనిపించింది. అయితే ఆ సంఘటన యేమిటో ఎప్పుడు జరుగుతుందో వూహించుకో లేకపోయాడు.

తర్వాత అతడి ఆలోచనలు శమంతమీదికి వెళ్ళాయి. అతనికి చదవాలనిపించలేదు. నవలను మూసి కళ్ళు మూసు కున్నాడు.

రైలు వేగంగా వెళుతోంది.

పరిసరాలు రివ్వున వెనక్కి వెళుతున్నాయి. అతడు

శ్రమంతతో తనని వూహించుకుంటూ కలలు కంటున్నాడు.

కలలు కంటూనే నిద్రలోకి జారుకున్నాడు.

జమదగ్నికి మెలకువ వచ్చేసరికి రైలు ఆగిపోయి వుంది. ఎదురు సీట్లలో కూర్చున్న మనుషులు లేరు. కిందికి దిగిపోయారు.

ఆశ్చర్యంగా బయటకు చూశాడు.

అక్కడ స్టేషన్ లేదు.

పక్కనే ఖాళీగా వున్న పొలాలు దూరంగా యేవో చెట్లు వెన్నెల్లో కనపడ్డాయి.

అతను ఎంట్రెన్స్ డోర్ దగ్గరకు వచ్చి అక్కడే కింద నిల్చున్న మనిషిని అడిగాడు.

"రైలు ఎందుకు ఆగిపోయింది?"

"ఏదో రిపేర్. బాగుచేస్తున్నారు. ఇంకో గంట వరకూ కదలదు."

ఖాళీగా వున్న పొలాల్లో అక్కడక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు మనుషులు.

వాచీకేసి చూసుకున్నాడు.

పదకొండు గంటలు కావస్తోంది.

సూట్కేసుతో కిందికి దిగాడు జమదగ్ని. దాన్ని అక్కడే వుంచి దిగొచ్చు. కాని యెవరైనా తీసికెళితే తను ఇబ్బందిపడాలి.

కొంచెం దూరంలో ఎక్కువగా మనుషులు లేని ప్రదేశంలో కర్చీఫ్ పరచుకుని కూర్చున్నాడు.

వాతావరణం ఆహ్లాదంగా వుంది.

అంతా వెన్నెల.

వెలుగు ఆకాశంలో నించి భూమ్మీదకు జారుతున్నట్టుగా వుంది.

కొంచెం దూరంవరకూ పొలాలు వున్నాయి. అక్కడి నించీ యేవో దట్టంగా పెరిగిన చెట్లు నల్లగా గుట్టలు పడి నట్టుగా అగుపడుతున్నాయి.

ఆ ప్రశాంతత జమదగ్నిని బాగా ఆకర్షించింది. అతను యేదో ఆకర్షణకు లోబడిపోయినట్టుగా అక్కడే కూర్చుండిపోయాడు.

రైలు ఇంజన్ దగ్గర యెవ్వరమంది మనుషులు గుమి కూడి వున్నారు.

వాళ్ళని చూడటంలేదు జమదగ్ని.

అతని అంతరంగంలో యేదోలా వుంది.

తన ఆలోచనల్లో, భావాల్లో యేదో చిత్రమైన మార్పు జరుగుతున్నట్టూ, ఏదో కలవరం కలుగుతున్నట్టూ అనిపించింది.

ఏదో చెప్పలేని అనుభూతి.

ఇంకొంచెం సేపట్లో తనకు యేదో జరగబోతుందని తెలిసినట్టుగా మనసుపడుతున్న చిత్రమైన ఆందోళన.

తనకేమవుతోంది?

ఎందుకిలా వుంది?

దూరంగా యేదో చెట్టుమీద పక్షి వుండుండి కీచు మంటూ అరుస్తోంది.

లేచి నిల్చుందామనుకున్నాడు. కాని లేవలేకపోయాడు. యెవరో తనని ఆదేశించినట్టుగా అక్కడ నించి కదల్లేక పోయాడు.

చెట్లకేసి చూస్తున్న జమదగ్ని ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు.

దూరంగా చెట్లవైపు నించి యెవరో ఒక మనిషి గబగబా నడిచివస్తున్నాడు.

ఎవరా మనిషి?

ఇంత రాత్రి వేళ యెక్కడినించి వస్తున్నాడు? యెక్కడికి వెళుతున్నాడు?

ఆ మనిషి నే చూస్తున్నాడు. దూరంనించి ఆ మనిషి రూపం అస్పష్టంగా వుంది కాని దగ్గరైనకొద్దీ అతడి ఆకృతి కొంచెంగా బోధపడింది.

కొంచెం సేపట్లో నే ఆయన దగ్గరకు చేరుకున్నాడు. వెన్నెల్లో ఆ ఆకారాన్ని సాధువుగా గుర్తించాడు జమదగ్ని.

ఆ సాధువు తన వైపుకే రావటం గమనించి కలవర పడ్డాడు జమదగ్ని.

ఆశ్చర్యమూ—భయమూ కలిగాయి.

ఆయనకు పొడవాటి గడ్డాలు నడుమువరకూ పెరిగాయి. భుజానికి జోలెలాంటిది తగిలించుకున్నాడు. చేతులకు యేవో కడియాలు ఉన్నాయి. పొడుగ్గా ఉన్నాడు. అరవై యేళ్లు దాటి వుంటాయి. మొహంలో యేదో దివ్యమైన తేజస్సు ప్రకాశిస్తోంది.

వస్తూ నే "గురుదేవా" అంటూ జమదగ్నికి నమస్కారం చేశాడు.

జమదగ్ని ఆశ్చర్యచకితుడయ్యాడు.

వెంట నే మాట్లాడలేకపోయాడు.

ఇదేమిటి?

అంతా కలగా వుంది.

తనని సాధువు గురుదేవా అంటున్నాడు.

"ఎవరు మీరు?" అన్నాడు జమదగ్ని నోరు పెగుల్చుకుని.

ఆయన వెంటనే మాట్లాడలేదు.

తర్వాత ఇలా అన్నాడు—

"ఎట్లా చెప్పేది? నేను మీ శిష్యుడిని. ఇట్లా చెబితే మీకు ఇప్పుడు అర్థంకాదు. కాని ఇది నిజం."

"నాకు నిజంగానే అర్థం కావటంలేదు. వివరంగా చెప్పండి" అన్నాడు జమదగ్ని.

"ఇరవై నాలుగేళ్ళ క్రితం సరిగ్గా ఇదే రోజున మీరు దైవంతో కలిసిపోయారు. ఆ జన్మలో మీరు యోగీంద్ర స్వామి. మీ శిష్యుడిని నేను. నాకు మీరు ఎన్నో దివ్యమైన మంత్రాలను ఉపదేశించారు. తిరిగి జన్మనెత్తుతాననీ, సరిగ్గా ఇరవై నాలుగేళ్ళ తర్వాత నాకు దర్శనమిస్తారనీ చెప్పారు. మీకోసమే యెదురుచూస్తున్నాను. రాత్రి కలలో కనిపించి ఇక్కడ కలుసుకోమన్నారు. తమ ఆజ్ఞ ప్రకారం కలుసుకోటానికి వచ్చాను. ఇప్పటి నా ఆనందం వర్ణనాతీతం గురుదేవా" అన్నాడాయన తిరిగి చేతులు జోడించి.

"ఇదంతా నిజమా?!"

"అవును గురుదేవా? నమ్మటం కష్టమే అయినా ఇదంతా నిజం. లేకపోతే ఈ రాత్రివేళ మీరు ఇక్కడ ఉంటారని నేనెలా తెలుసుకోగలను. అంతే కాదు. మీ నమ్మకానికై మీ గురించిన వివరాలు చెబుతాను. మీరు ఈ జన్మలో జమదగ్నిగా అవతరించారు" అంటూ అతని గురించిన వివరాలన్నీ పూర్తిగా చెప్పాడు.

నమ్మకుండా వుండలేకపోయాడు జమదగ్ని. అతని కూడా గత జన్మలో తను యోగీంద్రస్వామి అనే నమ్మకం పూర్తిగా కలిగింది. ఆ నమ్మకం కలిగిన తర్వాత మాతన శక్తి యేదో తనలో వున్నట్టుగా అతడికి అనిపిం

చింది.

"నాకేమీ గుర్తురావటంలేదు__ఎంతగా ప్రయత్నం చేసినా .... గత స్మృతులను పొందే అవకాశం నాకు లేదా?" అడిగాడు జమదగ్ని.

ఆయన నవ్వి "లేదు" అన్నాడు.

"గత జన్మలోని అద్భుత శక్తులను నేను తిరిగి పొందే అవకాశం వుందా?"

"లేదు. అప్పటి మీ జన్మ వేరు. అప్పుడు మీరు చిన్నతనంలోనే అన్నింటినీ వదులుకుని విరాగులుగా మారిపోయినట్లు నాతో ఎన్నో సార్లు చెప్పారు. అద్భుత శక్తుల సాధనకు ఎన్నో కఠోర నియమాలను పాటించారు. ఎంతో తపస్సు చేశారు. అతీంద్రియ శక్తులను సాధించారు. ఈ జన్మలో అటువంటివి పొందటం సాధ్యం కాదు."

నిరుత్సాహపడ్డాడు జమదగ్ని.

అలా జరగటానికి వీల్లేదు. ఇది తనకు ఒక అపూర్వమైన అవకాశం. ఈ అవకాశాన్ని తను వదులుకోకూడదు. గత జన్మలో ఎన్నో అద్భుత శక్తులను పొందిన తను ఈ జన్మలో ఒక్క శక్తైనా కలిగి వుండాలి.

"నన్నర్థం చేసుకోండి .... నాలో యేదో తపనగా వుంది. ఆరాటంగా వుంది. ఏదో ఒక అద్భుత శక్తిని పొందాలని నా అంతరాత్మ ఘోష పెడుతోంది. గత జన్మలో గురుదేవుడిగానే ఈ జన్మలో నేను ఈ కోరిక కోరుతున్నాను. తీర్చండి. కనీసం యేదో ఒక అతీంద్రియ శక్తి నాకు కావాలి."

మౌనంగా ఉండిపోయాడు ఆయన__యేదో ఆలోచిస్తూ.

"గురుదేవులు ఇంతగా కోరినమీదట కాదనలేక పోతున్నాను. మీ మనసును నేను అర్థం చేసుకోగలను. నా శక్తిని కొంత ధారపోసి మీలో ఒక అద్భుత శక్తిని ప్రవేశపెడతాను."

"ఏమిటా అద్భుత శక్తి?" కుతూహలంగా సంతోషంగా అడిగాడు జమదగ్ని.

"గొప్ప శక్తి....ఒక మనిషిని చూడగానే అతడి గురించి అంతా కళ్ళకు కట్టినట్టుగా తెలిసిపోవటమనే శక్తి....ఆ శక్తిని మీలో ప్రవేశపెడతాను... గురుదేవుని కోరిక కాదనలేను. పదండి."

జమదగ్నికి అంతా మాయగానే అనిపించింది. యాంత్రికంగా లేచి నిలుచున్నాడు.

అప్పుడు అతడు ఈ లోకంలోకి వచ్చి రైలుపట్టాలను చూశాడు.

అక్కడ ఆగివున్న రైలు లేదు.

ఎప్పుడు వెళ్ళిపోయిందో అతను గమనించనేలేదు. నిర్మానుష్యంగా వుంది.

4

సాధువు ముందుకు కదిలాడు.

మంత్రముగ్ధుడిలా ఆయన్ని అనుసరించాడు జమదగ్ని.

రైలు పట్టాలు దాటారు.

పొలాల మధ్యనించి సన్నని దారి వుంది. ఆ దార్లో నడుస్తున్నారు ఒకరి వెనుక ఒకరు.

సాధువు మాట్లాడటంలేదు.

బొమ్మలా ముందుకు కదులుతున్నాడు.

జమదగ్ని ఆ వెన్నెల్లో ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

రైల్వే స్టేషన్‌లో ఆ సాధువు చెప్పినమాట నిజ

మయ్యింది. తన జీవితంలో గొప్ప సంఘటన జరిగింది. ఈ సంఘటనతో తన జీవితంలో గొప్ప మార్పు సంభవించ బోతోంది.

ఆయన ఇంతకుముందు తను వచ్చిన దారినే నడుచుకు వెళ్లాడు.

దట్టంగా అడవిలా పెరిగిన చెట్లు వచ్చాయి. ఆ చెట్ల లోకి యిద్దరూ ప్రవేశించారు.

ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టు ఆ సాధువును అనుస రిస్తున్నాడు జమదగ్ని. అతడి అడుగులు వేగంగా పడు తున్నాయి.

చెట్ల మధ్య నించి నడుస్తున్నారు. వెన్నెల చెట్లలో నించి జల్లెడు పడుతున్నట్టుగా లోపలకు పడుతోంది.

బాగా లోపలకు వెళ్లారు.

అక్కడ ఒక నీటిమడుగు ఉంది. ఆగిపోయాడు సాధువు.

జమదగ్నిని దుస్తులు విడిచి ఆ నీళ్ళలో స్నానం చేసి రమ్మన్నాడు.

భయమేసింది అతడికి.

చలిగా ఉంది. ఆ చలిలో చల్లని నీటిలో స్నానం చెయ్యటమా?

జోలెలోనించి యేదో వస్త్రాన్ని తీసి ఇచ్చాడు. దాన్ని కట్టుకుని మడుగులో దిగాడు జమదగ్ని.

జివ్వుమన్నాయి నరాలు.

వణుకు పుట్టింది.

స్నానం చేసి పైకి వచ్చాడు.

చెట్టు పక్కనే కూర్చోమన్నాడు. జమదగ్నిని తన కళ్ళలోకి సూటిగా చూడమని అన్నాడు.

ఆ సాధువు కళ్ళలోకి సూటిగా చూశాడు జమదగ్ని.

ఆయన అలా చూస్తూ యేదో మంత్రాన్ని చదివాడు. మళ్ళీ మళ్ళీ చదివాడు.

"నువ్వు కూడా దీన్ని చదువు."

జమదగ్ని యాంత్రికంగానే ఆ మంత్రాన్ని పఠించాడు. అతనికి ఏదో నాగస్వరం వింటున్నట్టుగా వుంది.

శరీరం తేలికయిపోతున్నట్టుగానూ — యేదో శక్తి తనలో ప్రవేశిస్తున్నట్టుగానూ భావన కలిగింది.

తనకేమవుతోంది?

ఆలోచించాలనుకున్నాడు.

కాని అప్పటికే అతనికి స్పృహ పోయింది. స్పృహ పోవటానికి ముందుగానే ఆ సాధువు చెప్పాడు—ఎట్టి పరిస్థితులలోనూ ఈ అద్భుత శక్తి గురించిన రహస్యాన్ని ఎవ్వరికీ చెప్పకూడదని—అట్లా చెప్పిన మరు నిమిషంలో జమదగ్ని ప్రాణాలతో వుండడు.

జమదగ్నికి తిరిగి మెలకువ వచ్చినప్పుడు పైమెంత య్యిందో తెలీలేదు. వెంటనే అతను ఇటూ ఇటూ చూశాడు. చెట్టుపక్కనే నీడలో అతడి సూట్కేసు కనపడింది. అందులోనించి వాచీతీసి చూశాడు.

మూడు గంటలు కావస్తోంది.

సాధువు అక్కడ కనపడలేదు.

ఎందువల్లనో జమదగ్నికి భయం కలగలేదు. అతడిలో యేదో ధైర్యం కలిగింది.

దుస్తులు ధరించి సూట్కేసుతో అక్కడి నించి వెనక్కి తిరిగాడు.

కొన్ని నిమిషాల్లో ఆ అడవిని దాటి పొలాల్లోకి ప్రవేశించాడు. తర్వాత రైలుపట్టాల దగ్గరికి చేరుకున్నాడు.

పట్టాల వెంటనే నడిచాడు.

కొంత దూరం నడిచాక దూరంగా యేదో ఊరు ఉన్నట్టుగా దీపాలు కనిపించాయి.

గంటసేపు నడిచాడు జమదగ్ని, అక్కడ రైల్వే స్టేషన్ వుంది. ఆ స్టేషన్ అంతా నిద్రలో మునిగి వుంది.

5

"నీకోసమే యెదురుచూస్తున్నాం" అన్నది తల్లి. తండ్రికూడా అలాగే అన్నాడు.

వాళ్ళిద్దరి మొహాలూ విచారంగా వున్నాయి.

"గంటక్రితమే ఈ ఉత్తరం వచ్చింది" అని తండ్రి ఒక ఉత్తరాన్ని ఇచ్చాడు జమదగ్నికి.

ఆత్రంగా దాన్ని ఇలా చదివాడు.

నాన్నా—

మీరు వెంటనే బయల్దేరి రండి. నామీద వీళ్ళు దొంగతనం నేరాన్ని మోపారు. మా ఆడపడుచు గొలుసు పోయింది. దాన్ని నేనే తీశానని అంటున్నారు. ఈ నిందను భరించటం నాకు సాధ్యం కాదు. మాటలతో వీళ్ళంతా నన్ను హింస పెడుతున్నారు. వెంటనే రండి. మీకోసం యెదురు చూస్తుంటాను. —రమ.

కన్నీళ్ళొచ్చాయి జమదగ్నికి.

రమ అతడి ఒకే ఒక అక్కయ్య. రెండేళ్ళ క్రితమే ఆమె పెళ్ళయ్యింది.

"ఏం చేద్దాం?" అన్నాడు తండ్రి.

"అక్కయ్య నిప్పులాంటిదని మనకు తెలుసు. ఈ దొంగతనాన్ని ఆ ఇంట్లో ఇంకెవరో చేసివుంటారు. నేను వెళతాను. వీలుంటే ఆ దొంగను పట్టుకునే ప్రయత్నం

చేస్తాను" అన్నాడు జమదగ్ని.

"నీకు సాధ్యం అవుతుందా?" అన్నాడు తండ్రి.

"చూద్దాం. ఏమైనా నేనే వెళతాను. మీరు దిగులు పడకండి. ఈ సమస్యకు పరిష్కారం చూపగలననే నమ్మకం నాకు ఉంది."

"ఏమో! అంతా నువ్వే చూసుకో..." అన్నది తల్లి.

"రమకు ధైర్యం చెప్పు....వస్తానంటే తీసుకురా.... అక్కడ అమ్మాయి బాధపడకూడదు" తండ్రి అన్నాడు.

"అటువంటి అవసరం ఉండదనే అనుకుంటున్నాను."

కొడుకు ధైర్యానికి తండ్రి ఆశ్చర్యపోయాడు.

జమదగ్ని అప్పటికప్పుడే ప్రయాణమయ్యాడు.

బస్సెక్కాడు.

అతడి ఆలోచనలు వేగంగా పరుగులు దీస్తున్నాయి.

సాధువు తనలో ప్రవేశపెట్టిన అద్భుత శక్తితో తను ఆ దొంగను పట్టుకోవాలి.

సాధ్యమవుతుందా?

నిజంగా తనలో ఆశక్తి ప్రవేశపెట్టబడిందా?

ఏమో! ఇదే పరీక్ష.... వెళ్ళటంతోనే తను ముందు ఆ దొంగను ఆచూకీ తియ్యాలి.

వాళ్ళింటి ముందు రిక్షా నుంచి దిగాడు.

వరండాలోనే వుంది రమ

జమదగ్ని లోపలకు వస్తుంటే ఒక్కసారి పెద్దగా యేడ్చేసింది.

చలించిపోయాడు అతను.

"భయపడకు నేనొచ్చాను" అన్నాడు.

జమదగ్నిని చూడటంతో అంతా బయటకు వచ్చారు. అతడి బావ ఇంట్లో లేడు. ఆఫీసునించి ఇంకా తిరిగి

రాలేదు.

అంతా జమదగ్నిని సీరియస్‌గా చూశారు.

ఒక్కరూ వెంటనే మాట్లాడలేదు.

రమ అత్తగారు అన్నది.

"ఎప్పుడూ ఈ ఇంట్లో బంగారు వస్తువు పోలేదు. ఇదే మొదటిసారి."

జమదగ్ని మాట్లాడలేదు.

"రెండు మూడు ప్రశ్నలు అడిగాం....ఆకారాన్ని వర్ణించికూడా చెప్పారు" మళ్ళీ ఆమే అన్నది.

జమదగ్ని ఏదో మాట్లాడబోయేంతలో అప్పుడే గేటు నెట్టుకుని ఒక యువకుడు లోపలకు వచ్చాడు. సన్నగా-పొడుగ్గా వున్నాడు. సిగరెట్లు ఎక్కువగా కాల్చటంతో అతడి పెదవులు నల్లగా పొగచూరి వున్నాయి.

"ఎవరితను?" వస్తూనే అడిగాడు.

"వాళ్ళ తమ్ముడు" రమను చూపిస్తూ చెప్పింది రమ అత్తగారు.

"ఎందుకొచ్చాడు పిన్నీ" మళ్ళీ అడిగాడు.

అతని పేరు ఈశ్వర్. రమ పెద్దత్తగారి కొడుకు. వారం రోజుల క్రితం యేవో పరీక్షలు రాయటానికి ఆ వూరు వచ్చాడు.

"దొంగను పట్టుకోటానికి" అన్నాడు జమదగ్ని కటువుగా.

అతను నవ్వి "మీరు పోలీసు డిపార్టుమెంటులో పని చేస్తున్నారా?" అనడిగాడు.

జమదగ్ని కళ్ళు ఎర్రగా మారిపోయాయి.

కోపంతో అతడి మొహం జేవురించింది.

ఈశ్వర్‌ని చూస్తుంటే కళ్ళముందు జరిగినదంతా

సినిమా చూస్తున్నట్టుగా కనపడుతోంది.

అంత కోపంలోనూ జమదగ్నికి సంతోషం కలిగింది. సాధువు నిజంగానే తనలో ఒక అద్భుత శక్తిని ప్రవేశ పెట్టాడు.

"దొంగను పట్టుకోటానికి పోలీసు డిపార్టుమెంటుతో పని చేయవలసిన అవసరం లేదనుకుంటాను" అన్నాడు.

"ఐనా మీరు ప్రత్యేకంగా దొంగను వెతికి పట్టుకో వలసిన అవసరంలేదు. గొలుసు దొంగతనం చేసిన దొంగ యెవరో మాకు తెలిసిపోయింది" అన్నాడు ఈశ్వర్.

"ఎవరు? మా అక్కయ్యేనా?"

"అవును. చాలా క్లియర్ గా చెప్పాడు."

"ఎవరతను? ఎక్కడ వుంటాడు? ఈ ఊళ్ళోనేనా?"

"ఇక్కడే ఉంటాడు. ఆయన పేరు శివయ్యబాబా. ఆయన చెప్పేదంతా నూటికి నూరుపాళ్ళు నిజం."

"ఆ నిజాన్ని నేనుకూడా వింటాను.... నన్ను ఆయన దగ్గరకు తీసుకువెళతారా?" అనడిగాడు జమదగ్ని.

సరిగ్గా అప్పుడే జమదగ్ని బావ సుందరరావు వచ్చాడు.

"ఎప్పుడొచ్చావు?" అడిగాడు.

చెప్పాడు జమదగ్ని.

"నాకూ నమ్మకం కలగటంలేదు రమ దొంగతనం చేసిందంటే. కాని శివయ్యబాబా చాలా స్పష్టంగా వర్ణించి చెప్పాడు. ఆయన వర్ణన రమకు సరిగ్గా సరిపోయింది" అన్నాడు సుందరరావు.

"ఆల్ రైట్ .... పదండి. ఒకసారి శివయ్య బాబా దగ్గరకు వెళదాం" అన్నాడు జమదగ్ని.

రమకూడా వస్తానన్నది.

"వద్దు....నువ్వు ఇక్కడే వుండు. నువ్వు వర్రీ అవకు. నిజం తేలుస్తాను" అన్నాడు అతను.

శివయ్యబాబా యెవరితోనో మాట్లాడుతున్నాడు. ఎవరిదో ఉంగరం పోయిందిట. దాన్ని యెవరు తీశారో వాళ్ళతో చెబుతున్నాడు.

వాళ్ళు వెళ్ళిపోయారు.

ఈశ్వర్ ఆయనతో మాట్లాడాడు.

"మా బావమరిది. మీతో మాట్లాడాలని వచ్చాడు" అన్నాడు సుందరరావు.

"చెప్పండి" అన్నాడు శివయ్యబాబా ముందుకు పొడుచుకువచ్చిన బొజ్జని నిమురుకుంటూ.

"గొలుసు దొంగతనం గురించి ఒక స్త్రీని వర్ణించి చెప్పారుట. ఆ వర్ణన మా అక్కయ్యకు సరిపోయిందని వీళ్ళంతా అంటున్నారు. నిజమేనా?" అడిగాడు జమదగ్ని సౌమ్యంగా.

"అవును. నూరుపాళ్ళు నిజం. ఈ శివయ్యబాబా అబద్ధం చెప్పటానికి వీల్లేదు. ఆమే దొంగతనం చేసింది" అన్నాడు చాలా తేలిగ్గా.

అంతే. ఆయన తూలి బోర్లాపడ్డాడు. గోడకు తగిలి రెండు పళ్ళు వూడి కిందపడ్డాయి.

ఆ సంఘటనకు అంతా షాక్ తిన్నారు.

"ఇడియట్ .... చంపేస్తాను. నువ్వు నిజం చెప్పేవాడివా? అసలు నీకేం తెలుసు? నిన్ను పోలీసులకు పట్టిస్తాను" అన్నాడు జమదగ్ని కోపంగా.

"జమదగ్నీ ....ఏమిటిదంతా?" అన్నాడు సుందరరావు కంగారుగా.

శివయ్యబాబా మాట్లాడే స్థితిలో లేడు.

"బావగారూ....వీడొక మోసగాడు. నిజం యేమిటో నేను రుజువుచేస్తాను. నాతో ముగ్గురు రండి" అన్నాడు.

"ఎవరు? ఎక్కడికి?" అన్నాడు సుందరరావు.

"మీరు—ఈశ్వర్—గొలుసు పోగొట్టుకున్న మీ చెల్లెలు నేను తీసుకువెళ్ళే చోటుకు రండి. ఆ గొలుసును చూపిస్తాను."

"ఆ గొలుసు యెక్కడ ఉందో నీకు తెలుసా?"

"తెలుసు."

"ఎట్లా తెలుసు?"

"చెప్పను....మీకు నిజం తెలియాలి. అంతే. నాతో రండి."

"సరే పద" అన్నాడు సుందరరావు.

"నాకు పనుంది. నేను వెళతాను" అన్నాడు ఈశ్వర్.

"కాదు. నువ్వుకూడా రావాలి....నిజం నీక్కూడా తెలియాలి. ఎందుకంటే మా అక్కయ్య దొంగ అని నువ్వుకూడా అన్నావు."

"అవును. నువ్వుకూడా వచ్చెయ్యి. నష్టం యేమిటి? చూద్దాం. ఏం జరుగుతుందో" అన్నాడు సుందరరావు.

జమదగ్ని వాళ్ళని మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న చిన్న సందులోకి తీసుకెళ్ళాడు. అక్కడ ఒక దుకాణం వుంది. దాని బయట—షాభూత్‌మల్ నగాచంద్—వెండి, బంగారు నగలు తాకట్టు పెట్టుకొనబడును—అని రాసివుంది.

సేట్ పరుపుమీద కూర్చున్నాడు ఒక్కరే.

ఈశ్వర్‌ని చూపించి "నాలుగు రోజుల క్రితం ఒక గొలుసు తీసుకువచ్చి రెండొందల రూపాయలకు తాకట్టు పెట్టాడు. దాన్ని తీసుకురా" అన్నాడు.

"నేనా?" అన్నాడు కంగారుగా ఈశ్వర్....

"నువ్వు నోర్మూసుకో కొంచెంసేపు" అన్నాడు జమదగ్ని.

"ఎందుకు?" అడిగాడు దగాచంద్.

"ఆ గొలుసు దొంగిలించబడింది. పోలీసు కంప్లయింట్ కూడా ఇచ్చారు. ఇంకొంచెంసేపట్లో పోలీసులు ఇక్కడికి వస్తారు."

"అయ్యో.... అయ్యో" అంటూ సేట్ లోపలకు వెళ్ళి ఐదు నిమిషాల్లో ఆ గొలుసును తీసుకువచ్చాడు.

"అవును. ఇదే గొలుసు" అన్నది సుందరరావు చెల్లెలు హేమ.

ఈశ్వర్ మొహం మాడిపోయింది.

"ఎక్కడిదీ గొలుసు?" దగాచంద్‌ను అడిగాడు.

దగాచంద్ ఈశ్వర్‌ని చూపిస్తూ "ఈ కుర్రాడు తాకట్టు పెట్టాడు" అన్నాడు.

ఈడ్చి ఈశ్వర్ మొహంమీద అరచేత్తో కొట్టాడు సుందరరావు.

"వెధవా....నువ్వు దొంగతనంచేసి రమమీదకు నెడతావా? శివయ్యబాబా దగ్గరకుకూడా మమ్మల్ని నువ్వే తీసుకెళ్ళావు" అన్నాడు కోపంగా—

ఈశ్వర్ మాట్లాడలేదు.

తల వంచుకున్నాడు.

"నన్ను క్షమించు జమదగ్ని" అన్నాడు సుందరావు బాధగా....

"జరిగింది మరచిపోండి. ఇంకెప్పుడూ నిజం తెలియకుండా ఏ మనిషిమీదా నిందలు వెయ్యకండి" అన్నాడు జమదగ్ని.

"ఇదంతా నీకెలా తెలుసు?"

"ఏమో! నాకలా అనిపించింది. అంతకంటే నాకేమీ తెలీదు."

ఇంటికొచ్చారు.

రమ అంతా విని "నీ కెలా కృతజ్ఞతలు తెలియచేసు కోవాలో తెలీటంలేదు. వనొౣక గొప్ప నింద నించి రక్షించావు. ఎలా తెలుసుకున్నావ్ ఇదంతా?" అనడిగింది.

అక్కయ్యకుకూడా అట్లాగే చెప్పాడు జమదగ్ని.

తిరిగి తెల్లారిన తర్వాత రైల్లో ప్రయాణమయ్యాడు అతను.

ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్.

రివ్వున దూసుకు వెళుతోంది.

జమదగ్నికి సరయిన సీటు దొరకలేదు. అందుకే అతను ఒక్కో బోగీ చూసుకుంటూ నడుస్తున్నాడు.

రైలు పరుగెత్తుతూనే వుంది.

6

తక్కున ఒకచోట ఆగిపోయేడు జమదగ్ని. విండో పక్కనే కూర్చున్నాడు ఒక మనిషి. చాలా మామూలుగా వున్నాడు. సాధారణమైన దుస్తులు ధరించాడు. చేతికి సీకో వాచీ పెట్టున్నాడు.

తెల్లని ప్యాంటు, లేత నీలం రంగు చుక్కలున్న షర్టు వేసుకున్నాడు.

కిటికీలో నించి పొగను బయటకు వదులుతున్నాడు సిగరెట్ కాలుస్తూ.

అతడి సీటుకింద విడల్పాటి తోలు పెట్టె వుంది. అది మాసిపోయి అసహ్యంగా వుంది.

జమదగ్ని మెదడుకు యేవో సంకేతాలు అందాయి అతడి గురించి.

ఆలోచనలో పడిపోయేడు.

కళ్ళముందు సినిమా చూస్తున్నట్టుగా ఆ మనిషి చరిత్ర అంతా ఒక్కసారిగా కదిలింది.

మై గాడ్! ఐదు లక్షలు అనుకున్నాడు.

ఆ మనిషి జమదగ్నిని చూడలేదు. చూసినా జమదగ్నిలో అద్భుత శక్తి వుందనీ—ఆ శక్తితో అతను తన చరిత్ర చదువుతున్నాడనీ తెలుసుకోలేడు.

ఒక్క నిమిషం తర్వాత అతను అక్కడి నించి ముందుకు కదిలాడు ఒక్కో మనిషినీ చూసుకుంటూ....

ఒక బోగీలో నించి మరో బోగీలోకి దారి వుంది.

వేగంగా వెళుతోంది ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్.

చిన్న చిన్న స్టేషన్లు వెలిసినట్టుగా వెనక్కు వెళుతున్నాయి.

రెండో బోగీలో న్యూస్ టైమ్ దినపత్రిక చదువుతున్న మనిషిమీద జమదగ్ని దృష్టి ఆగిపోయింది.

ఆయన్ని చూస్తూనే గ్రహించాడు—పోలీసు ఇన్‌స్పెక్టర్. అక్కడికి దగ్గరలో వున్న పట్టణంలో ఆయన పనిచేస్తున్నాడు. మఫ్టీలో వెళుతున్నాడు ఒక్కడే.

"ఎక్స్‌క్యూజ్ మీ" అన్నాడు జమదగ్ని ఆయన దగ్గరకు వెళ్ళి....

తలెత్తి "ఏం కావాలి?" అన్నాడాయన సీరియస్‌గా.

"ఒక్కసారి ఆ ఎంట్రెన్స్ డోర్ దగ్గరకు వస్తారా? మీతో ఒక రహస్యం చెప్పాలి"

"రహస్యమా? ఎవరు నువ్వు!" ఆశ్చర్యంగా అడిగాడాయన.

"నేనిదిలో కూడా చెబుతాను. మీరు పోలీసు ఇన్‌స్పెక్టర్ అనీ, మీ పేరు చక్రపాణి అని నాకు తెలుసు" అన్నాడు తగ్గించి.

ఇంకేమీ మాట్లాడకుండా ఆయన జమదగ్ని వెనకే ఎంట్రెన్స్ డోర్ దగ్గరకు నడిచాడు.

జమదగ్ని ఆయనతో తను చూసిన మనిషి గురించీ, అతని సీటుకింద వున్న తోలు పెట్టె గురించీ చిన్నగా చెప్పాడు.

"ఏమిటీ నువ్వు చెప్పేదంతా నిజమేనా?" అనడిగాడు నమ్మలేనట్టు.

"నిజం, పన్నెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో వున్న ఒక కమర్షియల్ బ్యాంకును కొంతమంది మనుషులు దోచుకున్నారు. ఐదు లక్షల రూపాయలు మాయమైనాయి. ఇప్పుడు ఆ డబ్బును తోలుపెట్టెలో పెట్టుకుని ఆ ముఠాలో ఒక మనిషి ఈ రైల్లోనే వెళుతున్నాడు. అతన్ని పట్టుకునే ప్రయత్నం చెయ్యండి."

"అతను ఆ ముఠాలో ఒకడనీ, ఆ తోలుపెట్టెలో ఐదు లక్షల రూపాయలు వున్నాయనీ నీకెలా తెలుసు?" అడిగాడు చక్రపాణి.

"ఎలా తెలుసు అంటే నేనేమీ చెప్పలేను. నాలో అటువంటి శక్తి వుంది. నా మాటమీద మీకు నమ్మకం కలగటానికి చిన్న పరీక్ష పెడతాను. మీ జేబులో వున్న పర్సులో ఎన్ని డబ్బులున్నాయో మీరు చెప్పగలరా?" అనడిగాడు జమదగ్ని.

"ఖచ్చితంగా చెప్పలేను. రఫ్‌గా చెప్పగలను, రెండు వందల ఇరవై ఆరు రూపాయల ఎనభై పైసలు వుండొచ్చు" అన్నాడు.

"కాదు. నేను చెబుతాను. రెండుకందల ఇరవై రెండు రూపాయల ఇరవై పైసలుంటాయి. నేను సరిగ్గా చెప్ప గలిగితే నా మాట నమ్మండి. లేకపోతే అవసరం లేదు."

చక్రపాణి జేబులోనించి పర్సు బయటకు తీశాడు. నోట్లన్నీ లెక్కించాడు. రెండుకందల ఇరవై రెండు రూపాయలు వున్నాయి. ఇరవై పైసలు చిల్లర వుంది.

"యూ ఆర్ రియల్లీ గ్రేట్....నీ మాట నేను నమ్ము తున్నాను. ఆ మనిషి ఎక్కడ కూర్చున్నాడో క్లియర్‌గా చెప్పు. నువ్వు అతన్ని కనిపెడుతూ వుండు. అతన్ని పట్టు కునే యేర్పాటు నేను చేస్తాను" అని అక్కడి నించి గార్డు కేబిన్ కేసి వెళ్ళాడు చక్రపాణి.

జమదగ్నికి సంతోషం కలిగింది.

వెనక్కు వచ్చి ఆ మనిషి వెనగ్గా కొంచెందూరంలో నిల్చున్నాడు. ఆ మనిషి కళ్ళు మూసుకుని కునికిపాట్లు పడుతున్నట్టుగా నటిస్తున్నాడు.

యేదో చిన్న స్టేషన్‌లో ఆగింది ట్రెయిన్.

ఎక్స్‌ప్రెస్ రైళ్ళు అక్కడ ఆగవు.

సిగ్నల్ ఇచ్చే వుంది. ఐనా ఆగింది రైలు.

గార్డు ప్లాటుఫారంమీద పచ్చ జెండా పట్టుకు నిల్చున్న స్టేషన్ మాస్టర్‌ని పిల్చి మడత పెట్టిన కాయితం ఇచ్చి యేదో చెప్పాడు.

గార్డు విజిల్ వూది జెండా వూపాడు.

రైలు కదిలి వేగాన్నందుకుంది.

అతనికి ఇదేమీ తెలీదు. సిగ్నల్ ఇవ్వకపోతే ఆ స్టేషన్‌లోనే రైలాగిందనుకున్నాడు.

కళ్ళు తెరిచి ఇంకో సిగరెట్టు ముట్టించాడు.

ఆ తర్వాత వచ్చే స్టేషన్‌లో రైలాగుతుంది. ఆ స్టేషన్‌లోనే అతను దిగిపోతాడు.

ఇరవై నిమిషాల్లో స్టేషన్ వచ్చింది. చిన్న కుదుపుతో ఆగింది రైలు.

అతను లేచి సీటు కిందనించి తోలుపెట్టెను బయటకు లాగటానికి ముందుకు వొంగాడు. తిరిగి అతను ఆ పెట్టెతో నిల్చునేసరికి పక్కనే ముగ్గురు పోలీసులు ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ మఫ్టీలో చక్రపాణి వున్నారు.

అతని మొహం పాలిపోయి అందులో భయం కనపడింది.

చక్రపాణి తోలుపెట్టెను విసురుగా లాక్కుని దాన్ని అక్కడే తెరిచాడు.

దాన్నిండా కొత్త వందరూపాయల నోట్ల కట్టలు పేర్చి వున్నాయి.

“మై గాడ్!” అన్నాడు చక్రపాణి.

మరుక్షణంలో పోలీసులు అతన్ని కిందికి లాక్కెళ్లారు.

నిమిషాలమీద ఆ వార్తను హైదరాబాద్‌లోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు తెలియజేశాడు చక్రపాణి.

“ఇక నేను వెళతాను” అన్నాడు జమదగ్ని.

“నీలో వున్న అద్భుత శక్తికి నా జోహార్లు. పోలీసు డిపార్టుమెంటు నీకు యెంతగానో ఋణపడి వుంది. గొప్ప విలువైన దొంగను మాకు పట్టించావు. నీ ఎడ్రసు ఇచ్చి వెళ్ళు. నేరస్థులను పట్టుకోవటంలో అవసరమయినప్పుడు నీ సహాయం తీసుకుంటాం” అన్నాడు చక్రపాణి.

తన ఎడ్రసు చక్రపాణికిచ్చి మళ్ళీ రైల్లో ఎక్కాడు జమదగ్ని.

ఇంటికి వచ్చిన తర్వాత ఆ గొలుసు దొంగతనం చేసిన మనిషి గురించి చెప్పి తనెలా వాడిని పట్టించాడో వివరంగా తల్లి దండ్రులతో చెప్పాడు జమదగ్ని.

వాళ్ళు ఆశ్చర్యపడకుండా వుండలేకపోయారు.

"నమ్మలేకుండా వున్నాం. కాని నువ్వు చెబుతున్నావు కాబట్టి నమ్మక తప్పదు. అతనే తీశాడనీ అలా చేశాడనీ నీకెలా తెలిసింది?" అనడిగాడు తండ్రి.

"ఏమో అదే నాకూ తెలీదు. అతన్ని చూడటంతో నే నా కళ్ళముందు జరిగిపోయినట్టుగా అంతా కనపడింది. కనపడినట్టుగానే జరిగింది. సేట్ దగాచంద్ అతనే ఆ గొలుసును తెచ్చి తనదగ్గర తాకట్టు పెట్టినట్టుగా చెప్పాడు" అన్నాడు.

"నీలో యేదో అద్భుత శక్తి వుంది....నమ్మకుండా వుండలేను" అన్నాడాయన.

జమదగ్ని రైల్లో దొంగను పోలీసులకు పట్టివ్వటం గురించికూడా వాళ్ళకి చెప్పాడు.

ఆయన మళ్ళీ ఆశ్చర్యపడ్డాడు.

తల్లి కంగారు పడింది.

"నీకెందుకు? ఆ ముఠాలో మిగిలిన దొంగలకు నీ గురించి తెలిసిందంటే వాళ్ళు నీమీద కక్ష కడతారు" అన్నది భయంగా—

జమదగ్ని తేలిగ్గా నవ్వి—"నీకు అటువంటి భయం అవసరంలేదు. వాళ్ళు నాకు తెలీకపోయినా వాళ్ళెవరో నన్నేం చెయ్యాలనుకుంటున్నారో తెలుసుకోగలను" అన్నాడు.

"ఏమైనా నువ్వు పొరపాటు చేశావు. నీ గురించి

పోలీసు ఇన్‌స్పెక్టర్‌కి చెప్పకుండా వుంటే బావుండేది"
అన్నాడు తండ్రి.

"ఫర్వాలేదులే" అన్నాడు జమదగ్ని.

తెల్లారి ఉదయం అన్ని దినపత్రికల్లో రైల్లో దొరికిన బ్యాంకు దోపిడీ దొంగ గురించిన వార్త వచ్చింది. ఆ దొంగను తన అద్భుత శక్తితో మాపులతో నే గుర్తించి పట్టించి ఇచ్చిన జమదగ్ని గురించికూడా వాళ్లు రాశారు. అందులో జమదగ్ని ఎడ్రసు వివరాలుకూడా వున్నాయి.

ఆ రోజు సాయంత్రం యెన్నో రకాల పత్రికల విలేఖర్లు జమదగ్ని ఇంటికి వచ్చారు. అతన్లో వున్న అద్భుత శక్తి గురించి రకరకాల ప్రశ్నలు అడిగారు.

వాళ్ళ ప్రశ్నలన్నింటికీ అతను ఒక్కటే జవాబు చెప్పాడు.

"ఈ మధ్యనే ఈ అద్భుత శక్తి నాలో కలిగింది. కొంతమంది మనుషులను చూసినప్పుడు వాళ్ళ చరిత్ర గురించి నాకు తెరపై చూసినట్టుగా కనపడుతుంది. ఈ శక్తి నాలో ఎలా కలిగిందో నాకు తెలీదు. ఎంతకాలం వుంటుందో నాకు తెలీదు."

జమదగ్ని ఫోటోని తీసుకుని వెళ్ళిపోయారు పత్రికా విలేఖర్లు అంతా.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత "నాకేమిటో భయంగా వుంది" అన్నది అతడి తల్లి.

"భయమెందుకు? ఇది మీరెంతగానో సంతోషపడవలసిన విషయం. ఈ దెబ్బతో మన గురించి యెంతో మందికి తెలుస్తుంది. చెప్పలేనంత పబ్లిసిటీ వస్తుంది" అన్నాడు జమదగ్ని.

"నువ్వు యెన్నయినా చెప్పు.... నా భయం పోవటం

లేదు. ఇంకెప్పుడూ యెవరి గురించి తెలిసినా యెవరికీ చెప్పకు" అన్నదామె.

జమదగ్ని "సర్లే.... చెప్పనులే" అన్నాడు నవ్వుతూ-

8

సన్నగా—పొడుగ్గా ఎండిపోయిన వాడిలా వున్నాడతను. అలా వున్నా అతడి శక్తి అమోఘం. అతడే అక్కడ వున్న నేరసులందరికీ నాయకుడు.

గొప్ప గొప్ప బేంక్ దోపిడీలకు అతడే తిరుగులేని పథకాలను తయారుచేస్తూ వుంటాడు.

ఒకసారి గొంతు సవరించుకుని "మిమ్మల్నందరినీ ఇంత హాతాత్తుగా ఇక్కడ కలుసుకోమని యెందుకు చెప్పానో తెలుసుకుని వుంటారు. ఈ పేపర్లలో వచ్చిన వార్త గురించీ — వీటిల్లో ప్రచురించిన ఈ మనిషి ఫోటోని మీరంతా చూశారనుకుంటాను.

"ఇటువంటి మనిషి ప్రపంచం మొత్తంలో కేవలం ఇలాంటివాడు ఒక్కడు వున్నా యేడాదిలో ప్రపంచంలోని నేరసులందరినీ పోలీసులు పట్టుకుని జైళ్ళలో పెడతారు. నిజంగానే వీడు అద్భుతమైన మనిషి. మన వేషం చూసి తెలుసుకుంటాడనుకుంటే రకరకాల వేషాలు వేసుకు తిరగొచ్చు. కాని మనిషిని చూడగానే వాడి హిస్టరీ అంతా చెప్పేస్తాడుట. అందువల్ల మనం చెయ్యగలిగింది యేమీ లేదు."

"నిజమే.... ఈ వార్త చదివిన తర్వాత బయటకు వెళ్ళాలంటే భయంగా వుంది" అన్నారు ఎదురుగా కూర్చున్న ఇరవై మందిలో కొందరు.

"భయపడితే మనం దోపిడీలు చెయ్యలేము. ఐదు లక్షల రూపాయలతో మన సభ్యుడు గరుడాచలం ఆ

యువకుడి కారణంగా పట్టుబడిపోయాడనే వార్త నన్ను బాగా కుంగదీసింది. ఇలాంటి శక్తి వున్న మనిషి బతికి వుండగా మనంకాని, మనలాంటి నేరస్థులు కాని ఈ దేశంలో బతకలేరు. అందుకే వాడు చావాలి.... ఈ జమదగ్ని ఈ లోకంలోనే వుండకూడదు” అన్నాడు అతను.

“అవును. ఈ లోకంలో వుండకూడదు. వెంటనే వాడి పరలోక ప్రయాణానికి యేర్పాట్లు చెయ్యాలి” అన్నారు వాళ్ళంతా.

“గుడ్ .... నా ఉద్దేశంకూడా అదే .... వీలైనంత వేగంగా వాడ్ని అంతచెయ్యాలి. ఆ జమదగ్నిని హత్య చేసిన మనిషికి పాతిక వేలు బహుమతినికూడా ప్రకటిస్తున్నాను. వెళ్ళండి....మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి” అన్నాడు.

సభ్యులు సంతోషంగా లేచి నిలబడ్డారు.

జమదగ్నికోసం వేట మొదలయ్యింది.

9

శమంతను వెంటనే కలుసుకోవాలనుకున్నాడు కాని వీలుకాలేదు జమదగ్నికి. తర్వాత పత్రికా విలేఖర్లతోనే సాయంత్రం వరకు కాలం గడచిపోయింది.

ఆరు గంటలు కావస్తున్నప్పుడు ఇంటినించి బయటకు వచ్చాడు. ఎక్కడకు వెళుతున్నదీ ఇంట్లో చెప్పలేదు.

ఒకసారి తనకాబోయే భార్య శమంతతో సినిమాకు వెళ్ళివచ్చినట్టుకూడా అతను ఇంట్లో ఎవరికీ చెప్పలేదు.

అతను వెళ్ళేసరికి ఆరున్నరయ్యింది.

కిల్లీ బంకు దగ్గర నిలుచున్నాడు.

ఐదు నిమిషాలకు శమంత చెల్లెలు రేణుక ఇంట్లో నించి

బయటకు రోడ్డుమీదకు వచ్చింది.

"శమంత వుందా?"

"లేదు. సరళతో కలసి సినిమాకు వెళ్ళింది అరగంట క్రితం."

"ఏ సినిమాకు?" అడిగాడు.

చెప్పింది రేణుక.

ఆ థియేటర్ అక్కడకు ఎక్కువ దూరంలేదు. నడిచే వెళ్లాడు.

బుకింగ్ తెరిచే వుంది. ఆ సినిమా వచ్చి చాలా రోజులయ్యింది. జనం యెక్కువగా లేరు. టిక్కెట్టు తీసుకుని లోపలకు వెళ్లాడు.

లైట్లు వెలుగుతున్నాయి.

లోపలకు ఎంటరయిన జమదగ్నిని చూసి చప్పట్లు కొట్టింది శమంత ఒక చివర్నించి.

చూసాడు.

శమంత మనోహరంగా నవ్వింది.

షాక్ తిన్నాడు జమదగ్ని.

అతడి మనసులో యే కార్నర్ లోనో ఆమె గురించి తెలుసుకోవాలన్న కోరిక వుంది.

జమదగ్నిలోని అద్భుత శక్తి పనిచేస్తోంది.

శమంత చరిత్ర అతడి కళ్ళముందు గిర్రున తిరిగింది. క్షణంలో అతని మొహంలో భావాలు మారిపోయాయి. అతని మొహం చూసి ఆశ్చర్యపడింది శమంత.

"దారుణంగా మోసపోయాను" అనుకుంటూ రివ్వున బయటకు వచ్చేశాడు.

శమంత చరిత్ర ఇంత ఘోరమైనదా?_అనుకున్నాడు.

పది నిమిషాల తర్వాత జమదగ్ని గేటు తెరుచుకుని

మెట్లెక్కి ఓ మేడమీది గదిలోకి వెళ్ళాడు.

ఆ గదిలో పాతికేళ్ళ యువకుడు డిటెక్టివ్ నవల చదువుకుంటున్నాడు.

"ఎవరు కావాలి?" అనడిగాడు.

"మీరే."

"ఎందుకు?"

"మీతో పనుంది. నా పేరు జమదగ్ని. నా స్నేహితుడి పేరు నిరంజనరావు. అతను శమంత అనే అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. కాని ఆ అమ్మాయి కారెక్టర్ మంచిదికాదని, ఇంతకుముందు మీతో ఆమెకు బాగా పరిచయం వుందనీ నాకు తెలిసింది. నిజమో— కాదో తెలుసుకోవాలని వచ్చాను" అన్నాడు జమదగ్ని.

అతను ఇబ్బందిగా ఫీలయ్యాడు.

"ఫర్వాలేదు. నిజం చెప్పండి. నా స్నేహితుడు శమంతను ప్రేమించలేదు. పెళ్ళిచూపులు అయినాయి. ఇందులో అతను బాధపడతాడనే ఆలోచనలేదు. కాని నిజంగా ఆమె కారెక్టర్ మంచిది అవకపోతే అతను జీవితమంతా కుమిలిపోతాడు. ప్లీజ్—మీకు తెలిసిన నిజం చెప్పండి."

"నిజానికి శమంత పెళ్ళి చెడగొట్టటం నాకు ఇష్టం లేదు. కాని మీ మనసులో ఒక అనుమానం వుంది. అందువల్ల నిజం చెప్పక తప్పదు. శమంతను నేను ప్రేమించాను. పెళ్ళిచేసుకోవాలనుకున్నాను. అందువల్లనే శారీరకంగా ఆమెకు దగ్గరయ్యాను. కాని శమంతకు ఇంతకుముందే ఆమె బావతో శారీరక సంబంధం వుందని నమ్మకంగా తెలిసింది. గట్టిగా అడిగిన తర్వాత శమంత ఒప్పుకుంది. బావ తనని బలవంతం చేశాడని అందులో తన

తప్పులేదని చెప్పింది. చెడిపోయిన ఆడదాన్ని పెళ్ళిచేసు కునే విశాల హృదయం నాకు లేదు. అందుకే శమంతను వదులుకున్నాను" అన్నాడతను.

"థాంక్ యూ...శమంతను పెళ్ళిచేసుకోవాలనుకున్న ఇడియట్ ని నేనే. అమాయకమైన ఆమె కళ్ళని చూసి మోసపోయాను" అన్నాడు జమదగ్ని.

"మీరేనా!" ఆశ్చర్యంగా అడిగాడతను.

"అవును. నిజం తెలుసుకోటానికి అబద్ధం చెప్పాను. యేమైనా నన్నో గొప్ప ప్రమాదంలోనించి రక్షించారు. థాంక్ యూ మై ఫ్రెండ్" అని మెట్లు దిగి రోడ్డుమీదకు వచ్చేశాడు జమదగ్ని.

10

వీధి దీపాలు వెలుగుతున్నా జమదగ్ని కళ్ళముందు అంతా చీకటిగానే కనపడింది.

తనలో ప్రవేశపెట్టబడిన అద్భుత శక్తి కారణంగా తనో గొప్ప ప్రమాదంనించి బయటపడ్డాడు.

అందమైన కళ్ళతో — ఎర్రని పెదవులతో తనని ఫూల్ ని చేసింది శమంత. ఈ అద్భుత శక్తి తనలో లేకుండా వున్నట్టయితే తనకు శమంత గురించి యేమీ తెలిసేది కాదు. పెళ్ళయిన తర్వాత తెలిసినా తనేం చెయ్యగలిగేవాడు? ఏం చేసినా తన జీవితం నాశనం అయ్యేది.

జమదగ్ని మనసంతా ఈ సంఘటనతో వికలమయి పోయింది.

రోడ్డుమీద మనుషులు ఎదురొస్తున్నారు.

పార్కు దగ్గరకు వచ్చాడు జమదగ్ని. ఒకవైపు గోడ పడిపోయివుంది పార్కుకి. దట్టంగా చెట్లు-అక్కడక్కడ

సిమెంటు బెంచీలు వున్నాయి. పార్కు వెనకవైపు రైల్వేలైను వుంది.

లోపలకు వెళ్ళి సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు. అతనికి కొంచెం దూరంలో నలుగురు మనుషులు ఆఫీసు వ్యవహారాల గురించి మాట్లాడుకుంటున్నారు.

జమదగ్ని ఆలోచనలన్నీ శమంత గురించే వున్నాయి.

ఆడవాళ్ళని నమ్మకూడదు. శమంత గురించి ఇంటికి వెళ్ళగానే చెప్పాలి—ఇలా అనుకున్నాడు అతను.

ఆలోచనలతో అతడికి యెంత టైము గడిచిందీ తెలీలేదు.

పార్కులో యెక్కడో ఒక మూల దీపం గుడ్డిగా వెలుగుతోంది. జమదగ్ని కూర్చున్న చోటుకు వెలుతురు రాకుండా పొడుగాటి చెట్లు అడ్డుకుంటున్నాయి. అక్కడ కొంచెం చీకటిగా వుంది.

రైలుపట్టాల వైపునించి ముగ్గురు మనుషులు పడిపోయిన పార్కు గోడమీదగా లోపలకు రావటాన్ని జమదగ్ని తెలుసుకోలేకపోయాడు.

పార్కులో అతను ఒక్కడే వున్నాడు.

అంతా ఎప్పుడో వెళ్ళిపోయారు.

హఠాత్తుగా ఒకడు జమదగ్ని నోరు మూశాడు. ఉలిక్కిపడ్డాడు అతను.

జమదగ్ని ఏం జరుగుతున్నదో తెలుసుకునేలోపలే అతని యెదురుగా వచ్చిన ఇద్దరు మనుషులూ పొడుగాటి కత్తులను అతని గుండెలో బలంగా దించారు. చిన్నగా మూల్గి రెండు పోట్లకే తలవాల్చేశాడు జమదగ్ని.

"చచ్చిపోయాడు" అన్నాడు ఒకడు.

"వీడ్ని చంపి — ఈ దేశంలో మనలాంటి నేరస్థు

లందరికీ రియంతో మేలుచేశాం__" అన్నాడు రెండో వాడు.

"పాతిక వేల రూపాయల బహుమతిని మన ముగ్గురం సమానంగా పంచుకోవాలి" అన్నాడు మూడోవాడు.

ముగ్గురూ నవ్వుతుంటూ వెళ్ళిపోయారు.

జమదగ్ని శవం పార్కులో సిమెంటు బెంచీముందు నెత్తురుమడుగులో బోర్లా పడివుంది.

ఇప్పుడు ఆతనిలో అద్భుత శక్తిలేదు. దానికోసం అతడు పడిన తపన__చివరకు అతడి ప్రాణమే తీసింది.

ఆతడి శవాన్ని వెంటనే యెవరైనా చూడగలిగితే__ రేపటి పేపర్లో అదే సంచలన వార్త అవుతుంది.

__: అయిపోయింది :__